కొంగొత్త ఏడాది.. కోటి ఆశల సవ్వడి

కొత్త సంవత్సరం కొంగొత్త ఆశలను మోసుకొచ్చింది. కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు అంతా నూతన వత్సర వేళ ఆనందాన్ని తోటి వారితో పంచుకున్నారు. ఆత్మీయులు, అధికారులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

● అధికారులు.. ఆత్మీయులకు సత్కారాలు


కలెక్టర్ మల్లికార్జునకు శుభాకాంక్షలు చెబుతున్న నాలుగో తరగతి ఉద్యోగులు


జెడ్పీ చక్రవర్తికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు చెబుతున్న సచివాలయ ఉద్యోగులు


సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

మహారాణిపేట : నూతన సంవత్సరం సందర్భంగా విశాఖ జిల్లా నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నమ్మి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉద్యోగులు ఆదివారం కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వియ్యపు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ జోన్–4 కార్యాలయంలో..

సూర్యాబాగ్‌లోని జీవీఎంసీ జోన్–4 కార్యాలయంలో జెడ్పీ చక్రవర్తిని ఆదివారం గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పీజే గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ పీవీ కిరణ్‌కుమార్‌యాదవ్, నాయకులు ఈ.పవన్‌కుమార్, మురళీకృష్ణ, శ్యామలరావు పాల్గొన్నారు.

పలు చర్చిల్లో..

అల్లిపురం: సౌత్‌జైలురోడ్డు, అల్లిపురం, కల్వరిబాప్టిస్ట్ చర్చి, చలువతోట, కొబ్బరితోట, నేతాజీనగర్ తదితర ప్రాంతాల్లో గల చర్చిల్లో తెల్లవారు జాము నుండి ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. కల్వరిబాప్టిస్ట్ చర్చిలో ఉదయం 6.30 గంటలకు డాక్టర్ జి.మేత్యూ పీటర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెవరెండ్ కె.వేదమణి సందేశం అందించగా, డాక్టర్ బి.జాన్‌వెస్లీ దైవ వాక్య పఠనం చేశారు. అనంతరం 8.45 గంటలకు జరిగిన కార్యక్రమంలో రెవరెండ్ పీవీ ప్రసాద్ అధ్యక్షతన రెవరెండ్ జాన్‌పీటర్, ఆర్. జేమ్స్ సునీల్‌కుమార్ సందేశాన్ని అందించారు. 11 గంటల నుండి డాక్టర్ ఎం.నారాయణరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెవరెండ్ ఎం.జోసఫ్‌రాజ్ సందేశాన్ని అందించారు.

సీపీఐ కార్యాలయంలో..

అల్లిపురం: సీపీఐ కార్యాలయంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోరమండల్ వర్కర్స్ యూనియన్, రైల్వే సీటీఎస్, ఆటో వర్కర్స్ యూనియన్, మహిళా సమాఖ్య, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ తదితర నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, కార్మికులు, యూనియన్ నేతలు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి మరుపల్లి పైడిరాజులను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

దాబాగార్డెన్స్: నగర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. నగర అధ్యక్షుడు గొంప గోవిందరాజు కేక్ కట్ చేసి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. నగర ప్రజలు, పార్టీ శ్రేణులకు నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. గుత్తుల శ్రీనివాసరావు, పార్టీ అధికార ప్రతినిధి వజ్జిపర్తి శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ సంఘం వైస్ చైర్మన్ తోట వాసుదేవరావు, హైదరాలీ షింకా, భాషా, ఎం. లక్ష్మి, తమ్మినాయుడు, కోడిబోయిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో..

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి ఆదివారం విశేష పూజలు జరిపారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో..

కంచరపాలెం : జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి ఆలయ ఈవో సురేష్‌బాబు నేతృత్వంలో పూజారి ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

స్ఫూర్తి నింపాలి..

అల్లిపురం: నూతన సంవత్సరం అందరి జీవితాల్లో స్ఫూర్తి నింపి, విజయాలు తీసుకురావాలని వైఎస్సార్‌సీపీ యువనేత ద్రోణంరాజు శ్రీవత్సవ్ ఆకాంక్షించారు. 32వ వార్డు పరిధి నేరెళ్ళకోనేరులో కేఎన్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, కార్పొరేటర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్ కందుల నాగరాజు మాట్లాడుతూ 2023లో ప్రజలందరికీ అద్భుతంగా ఉండాలని ఆకాంక్షించారు.

జిల్లా జడ్జికి శుభాకాంక్షలు..

దాబాగార్డెన్స్ : విశాఖపట్నం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి, జిల్లా జడ్జి గుత్తల గోపిని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది బైపా అరుణ్‌కుమార్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. న్యాయవాదులు వాగుపల్లి చిన్నారావు, టీవీ రమణ, గుడిపల్లి సుబ్బారావు, డాక్టర్ చిగురుపల్లి బోసుబాబు, సంపత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏయూ వైస్ చాన్సలర్ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డిని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబును బైపా అరుణ్‌కుమార్ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా పరిషత్‌లో..

మహారాణిపేట : నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్రకు సీఈవో శ్రీరామ్మూర్తి, డిప్యూటీ సీఈవో సత్యనారాయణ తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ కార్యాలయం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సత్తిబాబు, ఏవోలు, ఇంజినీరింగ్ సిబ్బంది ఉన్నారు.

పునీత పేతురు దేవాలయంలో..

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ కెథడ్రల్ మైదానంలో గల పునీత పేతురు దేవాలయంలో పారిస్ పాస్ట్రల్ కౌన్సిల్ (పీపీసీ) నేతృత్వంలో రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పిల్లల నృత్యాలు, సాంస్కృతిక కార్యాక్రమాలు పలువురిని ఆనందింపజేశాయి.

పంచకర్లకు శుభాకాంక్షలు

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబును నీలమ్మవేపచెట్టు అమ్మవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మీ శ్రీనివాసరెడ్డి, ట్రస్ట్ బోర్డు సభ్యులు లక్ష్మీకాంతం, కె.గంగ, భీమరశెట్టి చంద్రకళ, వైఎస్సార్‌సీపీ నాయకులు బోర శ్రీనివాసరెడ్డి, కొల్లి సత్యవతి, పీలా మహేశ్ తదితరులు ఆదివారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో..

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నూతన సంవత్సర వేడుకలు వినూత్నంగా నిర్వహించారు. పర్యావరణ హితంగా సాగిన ఈ వేడుకల్లో మొక్కలతో హ్యాపీ న్యూ ఇయర్ 2023 ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి, బోటనీ అధ్యాపకురాలు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ పుష్పలత, డాక్టర్ గీతాంజలి, విద్యార్థినులు పాల్గొన్నారు.

కళా హాస్పిటల్లో..

సీతమ్మధార : కళా హాస్పిటల్లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివేకానంద స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు హాస్పిటల్ అధినేత డాక్టర్ వెంకట రమణమూర్తిని కలిసి వేంకటేశ్వర స్వామి చిత్రపటం అందించారు. కార్పొరేటర్ తోట పద్మావతి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సనపల రవీంద్రభరత్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం కార్యాలయంలో..

దాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సేవా సంఘం కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు పక్కి దివాకర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కోట రమేష్, కొప్పుల రామ్‌కుమార్, సీహెచ్ వెంకటేశ్వరరావు, కొయ్య రామకృష్ణ, బోదన లక్ష్మి, కర్రి రాములు, బత్తుల త్రినాథ్, రమణమ్మ, కాత్యాయిని పాల్గొన్నారు.


జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్రకు శుభాకాంక్షలు తెలుపుతున్న సీఈవో శ్రీరామ్మూర్తి తదితరులు


జిల్లా జడ్జికి శుభాకాంక్షలు తెలుపుతున్న న్యాయవాదులు


పంచకర్ల రమేష్‌బాబుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న బొర విజయలక్ష్మి


అన్నదానంలో పాల్గొన్న ద్రోణంరాజు శ్రీవత్సవ్, కందుల నాగరాజు తదితరులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


జాతీయ రహదారిపై లారీని ఢీకొట్టిన కారు (ఇన్‌సెట్) మృతుడు సందీప్ (ఫైల్)

గోపాలపట్నం/కూర్మన్నపాలెం : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఎయిర్‌పోర్టు సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదానికి సంబంధించి ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వడ్లపూడికి చెందిన సందీప్ ఓలా డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. నలుగురు ఫ్రెండ్స్‌తో కలసి న్యూ ఇయర్ కావడంతో శనివారం అర్ధ రాత్రి దాటిన తర్వాత బీచ్‌కు వెళ్లారు. తిరిగి ఉదయం 4 గంటల సమయంలో బయలుదేరారు. ఎయిర్‌పోర్టు జంక్షన్ దాటిన తర్వాత ముందు వెళ్తున్న లారీ కుడివైపు సిగ్నల్ లేకుండా తిరగడంతో వెనకకారులో వస్తున్న వారు అదుపు చేయలేక ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వడ్ల పూడికి చెందిన సందీప్ (23) అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న మరో ముగ్గురు చిన్నచిన్న గాయాలతోబయటపడ్డారు.

కుటుంబంలో విషాదం

చిన్నతనం నుంచి కిరాణా దుకాణాల్లో పనిచేస్తూ..ఎలక్ట్రికల్ పనులు నేర్చుకు ని భీమవరంలోని ఓలా ఎలక్ట్రికల్ వాహనాల కంపెనీలో చేరాడు. తండ్రి ఫార్మా కంపెనీలో చిరుద్యోగి. తల్లి ఆరోగ్యం కూడా అంతంతమాత్రంగా ఉంది. చేతికి అందొచ్చిన కొడుకు అర్ధంతరంగా తనువు చాలించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఘనంగా ఓబీసీ ఉద్యోగుల ఆత్మీయ కలయిక


ఆత్మీయ కలయికలో పాల్గొన్న స్టీల్ ఓబీసీ నాయకులు, ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల ఆత్మీయ కలయిక ఆదివారం ఘనంగా జరిగింది. ఈనెల 7న జరగనున్న స్టీల్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నికల ప్రచారంలో భాగంగా నెహ్రూ పార్కులో మహాత్మా జ్యోతిరావు పూలే ప్యానల్‌కు చెందిన కార్యవర్గ సభ్యులు, విభాగాల సమన్వయకర్తలు, విభాగ కమిటీల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమార్థం ఐదేళ్లుగా తమ కార్యవర్గం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. రానున్న ఎన్నికల్లో తమ ప్యానల్ గెలిపిస్తే మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. అడహాక్ కమిటీ నాయకులు కోమటి రవిశంకర్, నక్క వెంకటరమణ, నెల్లి అప్పలరాజు, పిల్లి చంద్రరావు, నమ్మి తాతారావు, డాక్టర్ కాంబ్లే, కళ్యాణి, వి.ఎం. నాయుడు, నమ్మి సత్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

దాబాగార్డెన్స్: రోడ్డు ప్రమాదాలు జరగకుండా 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ వార్డు పరిధి రెల్లివీధి మెయిన్‌రోడ్డులో పలు స్పీడ్ బ్రేకర్లు వేయించారు. అలాగే గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. కార్యక్రమంలో ఆకుల ఏసు, డేవిడ్‌రాజు, సత్యవతి, సచివాలయ కన్వీనర్ కాసరపు వాసు, దైవకుమార్, రామరాజు, ఆనంద్, డాక్టర్ రమణ, ఆదిలక్ష్మి, రోజా రమణి, వంశీ, శేఖర్, రామచంద్రరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ..

మహారాణిపేట : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగుల కోసం రూపొందించిన క్యాలెండర్‌ను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదివారం ఆవిష్కరించారు. ముందుగా ఉద్యోగుల సంఘం నాయకులు జవహర్, శ్రీనివాస్ కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు సూరిశెట్టి వెంకటరమణ, కార్యదర్శి బీవీఎస్ఎన్ రవిశంకర్, సిటీ అధ్యక్షుడు కె.కృష్ణాజీ, జిల్లా కోశాధికారి బి.ధనరాజు, ఉపాధ్యక్షుడు జి.శ్రీనివాస్, జిల్లా జాయింట్ సెక్రటరీ ఫణిశ్రీ, బి.అప్పారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సీతారామచంద్రస్వామి ఉత్తర ద్వార దర్శనం

దాబాగార్డెన్స్: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని జనవరి 2న జగదాంబ జంక్షన్ సమీపాన మహారాణిపేట అంబికాబాగ్‌లో వేంచేసిన సీతారామచంద్రస్వామి భక్తులకు ఉత్తర ద్వారంలో దర్శనం ఇవ్వనున్నారని ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. ఆ రోజు ఉదయం 5.30 నుంచి 12.30 గంటల వరకు ఉత్తర ద్వార దర్శనాలు ఉంటాయని పేర్కొన్నారు. ఏకాదశి రోజున మూడు కోట్ల మంది దేవతలు స్వామిని ఆరాధిస్తారని, అందుకే ఆ రోజున ముక్కోటి ఏకాదశి అని అంటారని శిరీష తెలిపారు. ముక్కోటి ఏకాదశి రోజున మహావిష్ణువు ఉత్తరద్వారం ద్వారా సమస్త భక్తులకు దర్శనం ఇస్తారన్నారు.

గౌతమ్ నహర్ సేవలకు గుర్తింపు


ప్రశంసాపత్రం అందుకుంటున్న గౌతమ్ నహర్

దాబాగార్డెన్స్: జోధ్‌పూర్‌లో జరుగుతున్న జైన్ తేరాపంత్ ధర్మసంఘ్ ఆరవ ప్రతినిధి సమావేశానికి విశాఖ నుంచి గౌతమ్ నహర్ ప్రాతినిధ్యం వహించారు. అఖిల భారతీయ తేరాపంత్ యువక్ పరిషత్ సోషల్ మీడియా ప్రచార గౌరవ, ఆచార్య మహాశ్రమన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నహర్ ప్రత్యేక సేవలకు జైన్ తేరాపంత్ యువక్ పరిషత్ ప్రతినిధులు ప్రశంసాపత్రం అందజేశారు. దేశవ్యాప్తంగా 70 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నట్టు నహర్ సాక్షికి తెలిపారు. తేరాపంత్ ధర్మసంఘ్ కేంద్ర సమాచారాన్ని తెలపడం, విదేశాలకు వెళ్లే సాధువులు, వారి ప్రత్యేక ఉపన్యాసాలను ఆన్‌లైన్ ద్వారా అందుబాటులో ఉంచడం, వివిధ ప్రాంతాల్లో నిర్వహించే సమాఖ్య కార్యక్రమాలు ప్రచారం చేయడం జాతీయ సమావేశం ముఖ్యోద్దేశం అన్నారు.

రోడ్డు ప్రమాదంలో యాచకుడు మృతి


నుజ్జునుజ్జు అయిన కారు

అల్లిపురం: టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి డీఆర్ఎం కార్యాలయం వద్ద శనివారం రాత్రి కారు ఫుట్‌పాత్‌ను ఢీకొట్టిన ఘటనలో అక్కడే ఉన్న యాచకుడు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. కారు నుజ్జునుజ్జు కాగా.. కారులో ఉన్నవారు అక్కడి నుంచి పరారయ్యారు. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం పూసపాటిరేగ మండలం, లంకలపురం గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి ఇనుపకుర్తి పుష్పక్, అతని స్నేహితులు కారులో ఉన్నట్టు తెలిపారు. ప్రమాదంలో కారులో ఉన్నవారికి ఎటువంటి గాయాలు కాలేదన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని తెలిపారు.

సాయంలోనూ ఆత్మీయ స్పర్శ

పెరిగిన పెన్షన్‌తో అర్హుల్లో ఆనందం


కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శైలజ


గౌరీవీధిలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న రంధి గోపి తదితరులు


కుమ్మరవీధిలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఝాన్సీ, శ్రీహరిరెడ్డి

దాబాగార్డెన్స్: అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడిన రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. పెన్షన్ మొత్తాన్ని పెంచడం, వృద్ధాప్య పింఛన్ కోసం వయసు ప్రమాణాలు తగ్గించడం వంటి చర్యలతో సాయంలోనూ ఆత్మీయ స్పర్శతో పేద, బడుగు, బలహీనవర్గాలకు ఆపన్నహస్తం అందజేస్తోంది. గత ప్రభుత్వం ఇచ్చిన రూ.వెయ్యి పింఛన్‌ను క్రమంగా రూ.3 వేల వరకు పెంచుతామని ప్రకటించి మాట నిలబెట్టుకునే విధంగా అడుగులు ముందుకు వేస్తోంది. నూతన సంవత్సర శుభాకాంక్షలతో నిన్నమొన్నటి వరకు ఇచ్చిన పింఛన్‌కు రూ.250 పెంచి మొత్తంగా రూ.2,750 లబ్ధిదారుల ముంగిటకు వెళ్లి అందజేస్తోంది. దీనిలో భాగంగా నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు. నియోజకవర్గంలో మొత్తంగా 26,321 మంది లబ్ధి పొందుతున్నారు. అలాగే నూతనంగా పలువురు వృద్ధులను గుర్తించి వారికి కూడా పంపిణీ చేశారు.

కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి..

జోన్–4 పరిధి 31వ వార్డు చిలకపేటలో గల కటకం రోజా అనే వృద్ధాప్య పెన్షనర్ అనారోగ్యం కారణంగా కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. వలంటీర్ పోలిపల్లి శైలజ ఆమె వద్దకే వెళ్లి పింఛన్ అందజేశారు. లబ్ధిదారులు, సచివాలయ సిబ్బంది వలంటీర్‌ను అభినందించారు.

గౌరీవీధి, కుమ్మరవీధి ప్రాంతాల్లో..

అల్లిపురం: గౌరీవీధి సచివాలయ పరిధిలో కృష్ణవేణి అనే వృద్ధురాలికి పెంచిన జగనన్న పింఛన్‌ను వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ, సచివాలయ సిబ్బంది పీవీ కిరణ్‌కుమార్, వలంటీర్ అరుణ అందజేశారు. అదే విధంగా కుమ్మరవీధి సచివాలయ పరిధిలో గల దివ్యాంగుడు గేదెల దత్తాత్రేయకు పింఛన్ అందజేశారు. కాగా పెంచిన పెన్షన్ అందడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. వలంటీర్ యల్లంకి ఝాన్సీ, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.

ఆలయాలకు భక్తుల తాకిడి


బల్లిగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన ఉత్తరద్వారం


నీలమ్మవేపచెట్టు అమ్మవారి దర్శనం చేసుకునేందుకు బారులు తీరిన భక్తులు


సాయి దర్బార్‌లో పూజలు చేస్తున్న భక్తులు

అల్లిపురం: నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం అల్లిపురం బల్లిగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానం, నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం, నూతనంగా వెలసిన షిర్డీ సాయి దర్బార్ భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జాము నుండి భక్తులు భగవంతుడిని దర్శించుకునేందుకు బారులు తీరారు. ఈ సందర్భంగా బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు గొడవర్తి వీర రాఘవాచార్యులు తెల్లవారు జాము 3గంటల నుండి సుప్రభాతసేవ, పాశురపఠనం, తిరుప్పావై తదితర సేవా కార్యక్రమాల అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. భక్తుల గోత్రనామాలతో విశేష అభిషేకాలు, అర్చనలు చేపట్టారు.

నీలమ్మవేపచెట్టు అమ్మవారి దేవస్థానంలో..

నీలమ్మవేపచెట్టు అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి ఆలయ అర్చకుడు జోగారావుశర్మ ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని అమ్మవారివీధి కొత్తమ్మవారి దేవాలయం, అచ్చియ్యమ్మపేట సాయిబాబా దేవాలయం, అభయహస్తాంజనేయ దేవాలయాల్లో భక్తులు విశేష పూజలు చేశారు.


విశేష అలంకరణలో బల్లిగిరి వేంకటేశ్వరస్వామి

సాయి దర్బార్‌లో..

33వ వార్డు వివేకానందకాలనీలో వెలిసిన సాయి దర్బార్‌లో సాయిబాబాకు విశేష పూజలు నిర్వహించారు. అభిషేకాల అనంతరం బాబాను విశేషంగా అలంకరించారు. నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్‌చేసి భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. సోమవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు శ్రీనివాసశాస్త్రి తెలిపారు. వ్రతాలు చేయించుకోవాలని కోరుకునే భక్తులు దేవాలయ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

ఏకాదశి పర్వదినానికి ఆలయాల సిద్ధం

● శీఘ్ర, ప్రత్యేక, ధర్మదర్శనం క్యూలైన్ల ఏర్పాటు
● అలంకరణలో ఉత్తరద్వారం

అల్లిపురం: ముక్కోటి ఏకాదశికి వైష్ణవాలయాలు సిద్ధమయ్యాయి. అల్లిపురం ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. తెల్లవారు జాము 4 గంటల నుండి స్వామికి ధనుర్మాస పూజలు ప్రారంభమవుతాయని ఆలయ ఈవో కె.పద్మావతి, ప్రధాన అర్చకులు గొడవర్తి రాఘవాచార్యులు తెలిపారు. సుప్రభాత సేవ, అభిషేకాలు, పాశుర పఠనం, అనంతరం 5 గంటలకు భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పిస్తామని తెలిపారు. ఉత్తర ద్వార దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఇప్పటికే ఏర్పాటు చేశామన్నారు. ఉచిత దర్శనం, ప్రత్యేక దర్శనంతో పాటు శీఘ్ర దర్శనాలు, ఈ ఏడాది రూ.100 దర్శనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తుల రద్దీకి తగిన విధంగా టెంట్లు, మంచినీరు, ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు కూడా ప్రసాదాలు, మంచినీరు పంపిణీ వంటి ఏర్పాట్లు చేస్తున్నాయి.


బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం


పూర్తయిన క్యూలైన్ ఏర్పాటు

రామాలయాల్లో ఏకాదశి పూజలు

అల్లిపురంలోని కోదండ రామస్వామి దేవస్థానం, రాంరాం దేవాలయం, కుమ్మరవీధి రామాలయాల్లో ఏకాదశి సందర్భంగా ఏకాహం కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.